క్లుప్తంగా

శాంతిఖని మైనింగ్ స్టాఫ్ పిట్ కమిటీ ఏర్పాటు

బెల్లంపల్లి: సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) మందమర్రి ఏరియా శాంతిఖని మైనింగ్ స్టాఫ్ పిట్ కమిటీని బుధవారం ఎన్నుకున్నట్లు బెల్లంపల్లి బ్రాంచ్ ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి దాగం మల్లేష్ ప్రకటించారు. శాంతిఖని మైనింగ్ స్టాఫ్ పిట్ వైస్ ప్రెసిడెంట్‌గా కాటం అశోక్‌కుమార్, పిట్ సెక్రెటరీగా పొట్ట రాయలింగు, పిట్ అసిస్టెంట్ సెక్రెటరీగా టి.శ్రీకాంత్, ట్రెజరర్‌గా బుర్కా ప్రశాంత్‌లను ఎన్నుకున్నట్లు తెలిపారు. వీరితో పాటు సరేందర్, కమలాకర్, సాంబశివ, ఎండి.ఫక్రుల్ హుడాలను ఇన్‌చార్జీలుగా ఎంపిక చేసినట్లు తెలిపారు.

బాధ్యతలు స్వీకరణ



సీఐని కలిసి మొక్క అందజేస్తున్న ఎస్సై

చెన్నూర్: పట్టణ ఎస్సైగా సుబ్బారావు బుధవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. చెన్నూర్‌లో విధులు నిర్వర్తించిన ఎస్సై వెంకటేశ్వరావు రామగుండం కమిషనరేట్‌కు బదిలీ కాగా, మంచిర్యాలలో విధులు నిర్వర్తిస్తున్న ఎస్సై సుబ్బారావు చెన్నూర్‌కు బదిలీపై వచ్చారు. ఉద్యోగ బాధ్యతలు స్వీకరించిన ఎస్సై సుబ్బారావు సీఐ రవీందర్, ఎస్సై శ్వేతలను మర్యాదపూర్వకంగా కలిశారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎస్సైకి సిబ్బంది స్వాగతం పలికారు.

ముస్లింలకు షర్బత్ పంపిణీ

మంచిర్యాలటౌన్: మొహర్రం సందర్భంగా మంచిర్యాల పట్టణంలోని 5వ వార్డు కౌన్సిలర్ సుదమల్ల హరికృష్ణ ముస్లింలకు బుధవారం షర్బత్‌ను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ముజావర్ ఖాజా, ఖలీం, ముష్షైత్‌ఖాన్, యూసుబ్, షకీల్, ప్రభాకర్, జబ్బార్ పాల్గొన్నారు.

బెల్లంపల్లి: మొహర్రం వేడుకలను పురస్కరించుకుని బుధవారం బెల్లంపల్లిలో షర్బత్ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. సేవా కార్యక్రమాల నిర్వాహకుడు ముక్తార్ ఆధ్వర్యంలో కాంటా చౌరస్తాలో షర్బత్‌ను విస్తారంగా అందజేశారు. మొహర్రం పండుగ వేళ నిష్ఠతో ఉన్న వ్యక్తులకు, ఇతరులకు షర్బత్‌ను అందజేసి ఉదారతను చాటుకున్నారు. కార్యక్రమంలో యూత్‌కాంగ్రెస్ మాజీ పట్టణ అధ్యక్షుడు ఆకాష్, ఆటో యూనియన్ ప్రెసిడెంట్ కుమార్, మోహిన్, మగ్దుమ్, అన్వర్, ముజ్జు, గౌస్, రాజ్‌కుమార్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

బోనాల జాతరకు తరలివచ్చిన భక్తులు



బోనాల ఊరేగింపులో జోగిని శ్యామలాదేవి, ప్రజలు





పోచమ్మ తల్లీ.. దీవించమ్మా

మంచిర్యాలఅర్బన్: పట్టణంలోని హమాలీవాడ (సినిమావాడ) కట్ట పోచమ్మ తల్లి ఆలయ ద్వితీయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం బోనాల జాతర ఘనంగా నిర్వహించారు. హమాలీవాడ భక్త ఆంజనేయ సాయిబాబా ఆలయం నుంచి హమాలీవాడ కట్టపోచమ్మ ఆలయం వరకు బోనాల ఊరేగింపు సాగింది. డప్పుచప్పుళ్ల మధ్య జోగిని శ్యామలాదేవి నృత్యం ఎంతగానో ఆకట్టుకుంది. పసుపు కుంకుమ అలంకరణతో బోనాలను తలపై పెట్టుకుని మహిళలు ముందుకు సాగారు. అనంతరం కట్టపోచమ్మకు బోనాలు సమర్పించుకున్నారు. జోగిని శ్యామలాదేవితో పాటు ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు తనయుడు చరణ్‌బాబు– శైలజ్య దంపతులు అమ్మవారికి బోనం సమర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఉప్పలయ్య, వైస్ చైర్మన్ మహేష్, కార్యక్రమ నిర్వాహకుడు శంకర్‌తో పాటు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



నస్పూర్: క్షీరాభిషేకం చేస్తున్న ఆర్ఎంపీ, పీఎంపీలు



బెల్లంపల్లిలో...



మందమర్రిలో...

బెల్లంపల్లి: రాష్ట్రంలో ఉన్న ఆర్ఎంపీ, పీఎంపీలకు శిక్షణ ఇప్పించి సర్టిఫికెట్లు అందజేస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రకటించడాన్ని స్వాగతిస్తూ బుధవారం బెల్లంపల్లిలో రేవంత్‌రెడ్డి చిత్ర పటానికి అనుభవ వైద్యులు క్షీరాభిషేకం చేశారు. తెలంగాణ అనుభవ వైద్యుల సంఘం ఆధ్వర్యంలో కాంటా చౌరస్తాలో క్షీరాభిషేకాన్ని నిర్వహించారు. రాష్ట్రంలో కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్ఎంపీ, పీఎంపీల సమస్యలపై సానుకూలంగా స్పందించడం అభినందనీయమన్నారు. ముఖ్యంగా శిక్షణ తరగతులు నిర్వహించి, ధ్రువీకరణ పత్రాలు అందజేస్తామని సీఎం ప్రకటించడం తో ఏళ్ల తరబడి కల నెరవేరబోయే సమయం వచ్చిందన్నారు. సీఎం తీసుకున్న నిర్ణయానికి అనుభవ వైద్యులు జీవితాంతం రుణపడి ఉంటారని పేర్కొన్నారు. శిక్షణ తరగతులను వీలైనంత త్వరగా నిర్వహించడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అనుభవ వైద్యుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బత్తుల రవి, బెల్లంపల్లి మండల శాఖ అధ్యక్షుడు వడ్లకొండ దశరథం, సంఘం బెల్లంపల్లి మండల సెక్రెటరీ ఎం.శ్రీనివాస్, కోశాధికారి గుండా రాజేశం, సీనియర్ అనుభవ వైద్యులు సజ్జనపు బ్రహ్మానందం, లక్ష్మణాచారి, ఆదేపు వెంకటేశం, బిశ్వాస్, జోసెఫ్ రాజు, రాజశేఖర్, భూపతిరాజు, పోశం, బానేష్,నర్సింహాచారి, దత్తు ,శ్రీహరి ,రవీందర్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నస్పూర్: సీసీసీలోని పట్టణ ఆర్ఎంపీ, పీఎంపీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు డి.మొండయ్య, పట్టణ అధ్యక్షుడు పీ. సతీష్, ప్రధాన కార్యదర్శి బి. లక్ష్మణ్, జిల్లా సహాయ కార్యదర్శి కే.రాజు, గౌరవ అధ్యక్షులు ఏ. శ్రీనివాస్, బి. ప్రశాంత్, బి.శ్రీధర్, అశోక్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

మందమర్రిరూరల్: పట్టణంలోని ఆర్ఎంపీ, పీఎంపీలు హర్షం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలిపారు.

భీమిని: కన్నెపల్లి మండల ఆర్ఎంపీ, పీఎంపీ అనుభవ వైద్యులు బుధవారం సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మాదవరపు నర్సింగరావు, నియోజకవర్గ ఆర్ఎంపీ సంఘం అధ్యక్షుడు రాజేశ్వర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు రవీందర్, ఆర్ఎంపీలు కిరణ్‌చారి, రాజిరెడ్డి, లింగన్న, శంకర్, బాలు, తిరుపతి, రమేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బీడీ కార్మికుల ధర్నా జయప్రదం చేయండి

జన్నారం: ఈ నెల 19న బీడీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం మంచిర్యాల జిల్లా కలెక్టరేట్ ముందు చేపడుతున్న ధర్నాను జయప్రదం చేయాలని ప్రగతిశీల బీడీ కార్మికుల యూనియన్ రాష్ట్ర నాయకులు సునార్కరి రాజేశ్, దాసరి అరుణ కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీడీ కార్మికులకు చేయూత పథకం కింద నాలుగు వేల రూపాయలు ఎలాంటి ఆంక్షలు లేకుండా ఇవ్వాలని డిమాండ్ చేశారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా బీడీ కార్మికులకు కూలీ రేట్లు పెంచాలన్నారు. ఈ నెల 19న కలెక్టరేట్ ఎదుట జరిగే ధర్నాకు జిల్లా నలుమూలల నుంచి బీడీ కార్మికులు హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. పీఓడబ్ల్యూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జ్యోతి, జిల్లా నాయకులు మల్లన్న తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పీడీఎస్‌యూ నాయకులు

నీటి సరఫరాలో అంతరాయం

తాండూర్: మండలంలోని మాదారం టౌన్‌షిప్ కాలనీలో నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడింది. రెండు రోజుల క్రితం గ్రామానికి నీరు సరఫరా చేసే ఎంవీకే వన్ ఇంక్‌లైన్ మోటర్ చెడిపోవడంతో నీటి సమస్య తలెత్తింది. బెల్లంపల్లి ఏరియా సింగరేణి అధికారులు నీటి ట్యాంకర్ ద్వారా కాలనీలో నీరు సరఫరా చేస్తూ ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు. మంగళవారం ఎంవీకే 1 ఇంక్‌లైన్ వద్ద చెడిపోయిన మోటర్‌ను తొలగించి మరో మోటర్‌ను బిగించినప్పటికీ అది కూడా మొరాయించింది. దీంతో బుధవారం సింగరేణి సివిల్ అధికారులు మరో మోటర్ బిగింపు ప్రక్రియను చేపట్టారు.

రాపన్‌పల్లికి విద్యుత్ పునరుద్ధరణ

సాక్షి ఎఫెక్ట్..

కోటపల్లి: మండలంలోని రాపన్‌పల్లి ఎస్సీ కాలనీ అంధకారంలో ఉందని బుధవారం 'సాక్షి'లో ప్రచురితం కాగా విద్యుత్ అధికారులు స్పందించారు. రాపన్‌పల్లి ఎస్సీ కాలనీలోని ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏఈ వెంకటేశ్వర్లు, లైన్‌మెన్ సత్యనారాయణ, కార్యదర్శి కమల్ పరిశీలించి నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయించి ఎస్సీ కాలనీలో విద్యుత్ వెలుగులను పునరుద్ధరించారు. దీంతో ఎస్సీకాలనీవాసులు సంతోషం వ్యక్తం చేస్తూ 'సాక్షి'కి కృతజ్ఞతలు తెలిపారు.



ట్రాన్స్‌ఫార్మర్ అమరుస్తున్న సిబ్బంది

ప్రమాదాల నివారణకు కృషి

కోటపల్లి: జాతీయ రహదారి 63పై ప్రమాదాల నివారణకు కృషి చేస్తున్నట్లు సీఐ సుధాకర్ తెలిపారు. పార్‌పల్లి 63వ జాతీయరహదారి అనుకుని ఉన్న గ్రామాల వద్ద బుధవారం ప్రమాదాలు జరగకుండా సీఐ సుధాకర్, ఎస్సై రాజేందర్ ఆధ్వర్యంలో బారికేడ్లు ఏర్పాటు చేయించారు. ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని సీఐ సుధాకర్ కోరారు.



బారికేడ్లు ఏర్పాటు చేయిస్తున్న సీఐ

అంబేద్కర్‌ను అవమానించిన వారిపై చర్యలు తీసుకోవాలి

తాండూర్: భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్‌ను అవమానించిన వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని రాజీవ్‌నగర్, సుభద్ర కాలనీవాసులు డిమాండ్ చేశారు. తాండూర్ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. గతంలో తాండూర్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహాన్ని, రెండు సంవత్సరాల క్రితం జాతీయ రహదారి విస్తరణలో భాగంగా బుధవారం అంగడి ప్రాంతంలో ఉంచినట్లు తెలిపారు. నాలుగు రోజుల క్రితం మండలానికి చెందిన కొందరు వ్యక్తులు విగ్రహాన్ని అక్కడి నుంచి తొలగించి, ఎంవీకే -1 ఇంక్‌లైన్ ప్రాంతంలో పడవేసి అవమానించారన్నారు. ఇలాంటి వారిపై చర్యలు తీసుకోని పక్షంలో ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు ములకల్ల శ్రీనివాస్, జాడి ప్రశాంత్, ఆయిల్ల మోహన్, జాడి గోపి, ఇప్ప బాలకృష్ణ, గొడిశెల సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు



నెన్నెల హన్మాన్ ఆలయంలో భజన చేస్తున్న భక్తులు



జైపూర్ వేంకటేశ్వర స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

ఘనంగా తొలి ఏకాదశి

తాండూర్/బెల్లంపల్లిరూరల్/చెన్నూర్‌రూరల్/జైపూర్/కాసిపేట/నెన్నెల/భీమిని/వేమనపల్లి: ఆషాఢ శుద్ధ ఏకాదశి రోజైన బుధవారం తొలి ఏకాదశి పర్వదిన వేడుకలను పలు ఆలయాల్లో అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయాలకు చేరుకుని శ్రీమన్నారాయణ పేరిట ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇళ్లల్లో పిండి వంటలు బంధువులతో ఆనందంగా గడిపారు. తాండూర్ మండలంలోని మాదారం శ్రీ కోదండ రామాలయంలో శ్రీ సీతారామచంద్ర మూర్తులకు అభిషేక కార్యక్రమాన్ని చేపట్టారు. బెల్లంపల్లి మండల పరిధిలోని కన్నాల శ్రీ బుగ్గ రాజేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు. చంద్రవెల్లి గ్రామంలో శ్రీ అన్నపూర్ణ సహిత సోమేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఎక్కాహం కార్యక్రమం చేపట్టారు. జైపూర్‌లో భూనీల సమేతా శ్రీ వెంకటేశ్వర స్వామి ఆయలంతో పాటు వేలాల మల్లన్నస్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. భీమిని మండలంలోని జగ్గయ్యపేట, కన్నెపల్లి మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీవెంకటేశ్వరాలయంలో ఎక్కాహం, 24 గంటల భజన కార్యక్రమం చేపట్టారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



వేమనపల్లిలో...



చంద్రవెల్లి సోమేశ్వరాలయంలో ఎక్కాహం నిర్వహిస్తున్న భక్తులు



ఒతుకుపల్లి హనుమాన్ ఆలయంలో...



వీరాపూర్ హన్మాన్ ఆలయంలో పూజలు



భీమారంలో డప్పు చప్పుళ్ల మధ్య పీరీల ఊరేగింపు



నెన్నెలలో అగ్నిగుండం దాటుతున్న కర్బలసవారీ

భక్తిశ్రద్ధలతో మొహర్రం

భీమారం/నెన్నెల/జైపూర్/నస్పూర్/దండేపల్లి/జన్నారం/మందమర్రిరూరల్/రామకృష్ణాపూర్/వేమనపల్లి/తాండూర్/మంచిర్యాలరూరల్(హాజీపూర్): త్యాగానికి ప్రతీకగా నిలిచే మొహర్రం వేడుకలను జిల్లా వ్యాప్తంగా బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తొమ్మిది రోజుల పాటు సవార్లను ఏర్పాటు చేసి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. తల్లిపీరీ, కర్బలాపీరీలను ఊరేగించారు. సవారీ బంగ్లాల ఎదుట ఏర్పాటు చేసిన అగ్ని గుండం చుట్టు భక్తులకు కాళ్లకు గజ్జెలు కట్టుకొని డప్పుచప్పుళ్ల మధ్య లయబద్ధంగా అసైదుల్లా అంటూ పాటలు పాడుతూ ఆడిపాడారు. పీరీలకు సబ్జా ఆకు పూల దండలు వేసి మలీదముద్దలు, కుడకలు, షర్బత్‌ను నైవేద్యంగా సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ప్రజలు కుల, మతాలకు అతీతంగా ఈ వేడుకల్లో పాల్గొన్నారు. హిందూ ముస్లింల స్నేహ భావానికి ప్రతీకగా మొహర్రం వేడుకలు ఘనంగా జరిగాయి. సాయంత్రం పీరీలను ఊరేగిస్తూ సమీప వాగుల్లో నిమజ్జనం చేశారు.



మందమర్రిరూరల్: మొక్కు తీర్చుకున్న ఓదెలు



నర్సింగాపూర్‌లో పీరీలతో భక్తులు



వేమనపల్లిలో బంగ్లా పీరీలతో అలాయిబలాయి



తాండూర్‌లో పీరీలతో ర్యాలీ



దండేపల్లి: మేదరిపేటలో పీరీల ఊరేగింపు



సీసీసీలో పీరీలను దర్శించుకుంటున్న భక్తులు

సంక్షిప్త వార్తలు

పారిశుద్ధ్య కార్మికుడికి ఆర్థిక సాయం

నెన్నెల: మండలంలోని ఆవుడం గ్రామపంచాయతీలో విధులు నిర్వర్తిస్తున్న వెల్గటూరి లక్ష్మణ్ అనే పారిశుద్ధ్య కార్మికుడు నాలుగు రోజుల క్రితం ఆవుడం జిల్లా పరిషత్ పాఠశాలలో మరుగుదొడ్ల కోసం ఏర్పాటు చేసిన వాటర్ ట్యాంకును శుభ్రపర్చే క్రమంలో గోడ కూలి కాలు విరిగింది. ప్రస్తుతం ఆయన ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న నెన్నెల కోవిడ్‌వలంటరీ బృందం వ్యవస్థాపకుడు, ఉపాధ్యాయుడు శ్రీనివాస్, జైపూర్ సోపతి వెల్ఫేర్ సొసైటీ సభ్యులు వాట్సాప్ గ్రూపుల ద్వారా సేకరించిన రూ.20 వేల నగదును బాధిత కుటుంబానికి బుధవారం అందజేశారు.

నేడు రైతువేదిక వద్ద సమావేశం

భీమారం: మండల కేంద్రంలోని రైతువేదిక వద్ద గురువారం రైతులతో సమావేశం ఏర్పాటు చేసినట్లు ఏఈవో అరుణ్‌కుమార్ తెలిపారు. ప్రభుత్వం రైతులకు రూ.లక్ష వరకు గల రుణాలను మాఫీ చేసి బ్యాంకుల్లో జమ చేసే కార్యక్రమాన్ని సీఎం ప్రారంభించనున్న నేపథ్యంలో సమావేశం నిర్వహిస్తున్నామని తెలిపారు. మాఫీ పొందిన రైతులు రైతువేదిక వద్దకి రావాలని ఏఈవో కోరారు.

వేమనపల్లి: మండల కేంద్రంలోని రైతు వేదికలో గురువారం నిర్వహించే సీఎం రేవంత్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమానికి మండలంలోని ప్రజాప్రతినిధులు, రుణమాఫీ లబ్ధిదారులు హాజరుకావాలని ఏఓ వీరన్న తెలిపారు. అక్కడే సీఎంతో వీడియో కాన్ఫరెన్స్‌లో రైతులు మాట్లాడాల్సి ఉంటుందన్నారు.

నేడు చెక్కుల పంపిణీ

బెల్లంపల్లి: స్థానిక తహసీల్ కార్యాలయంలో గురువారం లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను అందజేయనున్నారు. ఉదయం 11 గంటలకు బెల్లంపల్లి మున్సిపల్, గ్రామీణ ప్రాంత వాసులతో పాటు తాండూర్ మండల లబ్ధిదారులకు బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ ముఖ్యఅతిథిగా హాజరై చెక్కులను అందజేస్తారు. సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను కూడా పంపిణీ చేయనున్నారు.

అన్నదానం

మంచిర్యాలఅర్బన్: తొలి ఏకాదశి సందర్భంగా స్థానిక రైల్వేస్టేషన్, బస్టాండ్ సమీపంలో నేతకాని స్టూడెంట్ ఫెడరేషన్, జాతీయ విద్యార్థిసమైక్య ఆధ్వర్యంలో బుధవారం అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు గోపాల్, వంశీలు పాల్గొన్నారు.

ఆనంద నిలయానికి చేయూత

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని శ్రీశ్రీనగర్‌లో రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆనంద నిలయం అనాథ, వృద్ధుల ఆశ్రమం నిర్వహణకు గాను గట్ల వాసుదేవరెడ్డి కుమారుడు అధిరానందన్ పుట్టిన రోజు సందర్భంగా రూ.33వేలను బుధవారం అందించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ చైర్మన్ కంకణాల భాస్కర్ రెడ్డి, ఆశ్రమం నిర్వాహకులు పాల్గొన్నారు.

వర్షానికి కూలిన ఇల్లు

మందమర్రిరూరల్: మండలంలోని వెంకటాపూర్ గ్రామ పంచాయతీ పరిధి గుడిపెల్లికి చెందిన ఒంటెల రమ ఇల్లు రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి బుధవారం కూలిపోయింది. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది.